సాక్షి
పల్నాడు
ఆదివారం । 29 । సెప్టెంబర్ । 2024



జాషువా గృహ సందర్శన

వినుకొండ(నూజెండ్ల): కవి కోకిల గుర్రం జాషువా స్వగ్రామం చాట్రగడ్డపాడులోని ఆయన గృహాన్ని ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం నాయకులు శనివారం సందర్శించారు.



పులిచింతల నీటి నిల్వ

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టులోకి ఎగువ నుంచి 24890 క్యూసెక్కులు వచ్చి చేరుతుండగా దిగువకు 16000 క్యూసెక్కులు వదులుతున్నారు.

ఆలయంలో పూజలు



మంగళగిరి: మంగళగిరిలోని లక్ష్మీనృసింహ స్వామి ఆలయంలో శనివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు.

స్వామీ.. బాబుకు బుద్ధి చెప్పు

ఆ పాదం పుణ్యపాదం.. కలియుగ దేవుడు కొలువైన అత్యంత పవిత్రమైన ప్రదేశం.. ఒక్కసారి ఆ భూమిపై అడుగు పెట్టడమే భాగ్యంగా భావిస్తారు.. వందల ఏళ్ల చరిత్ర కలిగిన లడ్డూ ప్రసాదానికి.. రాజకీయ రంగు పులిమి కళంకితం చేశారు.. ఆపద మొక్కులవాడ.. అనాథ రక్షక.. కరుణాకటాక్షక మన్నించు.. దుష్ట రాజకీయాలు చేస్తున్న దుష్టులను శిక్షించి.. నిన్నే నమ్మిన.. ప్రజానీకాన్ని రక్షించు.. ఏ తప్పు చేయని వారిపై అభాండాలు మోపుతున్న క్రమంలో ఆపదల నుంచి గట్టెక్కించి.. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, కూటమి నేతలకు సద్బుద్ధిని కల్పించాలని కోరుతూ.. శనివారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఆలయాలలో వైఎస్సార్ సీపీ నేతలు, కార్యకర్తలు పూజలు

- పెదకూరపాడు నియోజకవర్గంలో పోలీసు నిర్బంధం
- తప్పులు కప్పిపుచ్చుకునేందుకే డిక్లరేషన్ డ్రామా
- అమరేశ్వరునికి రుద్రాభిషేకం
- బాలచాముండేశ్వరికి కుంకుమపూజలు



చిలకలూరిపేట మండలం గోవిందపురంలో సాయిబాబా మందిరంలో పూజలు నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

సాక్షి, నరసరావుపేట: తిరుమల తిరుపతి దేవస్థానం పవిత్రతను దెబ్బ తీసే విధంగా వ్యవహరిస్తున్న చంద్రబాబునాయుడు, కూటమి ప్రభుత్వం చేసిన పాపాలను ప్రక్షాళన చేయాలని జిల్లా వ్యాప్తంగా వైఎస్సార్ సీపీ నేతలు, కార్యకర్తలు దేవాలయాల్లో పూజలు నిర్వహించారు. కోట్లాది మంది ప్రతీగా భావించే తిరుమల లడ్డూను రాజకీయంగా వాడుకోని దాని ప్రతిష్టను దెబ్బతీయడం పట్ల విచారం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం చేసిన తప్పులను క్షమించాలని దేవదేవున్ని కోరుకున్నారు. టీటీడీ ప్రతిష్టను కాపాడాలని డిమాండ్ చేశారు. దేవలయాల్లో పెద్ద సంఖ్యలో కొబ్బరికాయలు కొట్టి, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పోలీసు నిర్బంధం

పెదకూరపాడు నియోజకవర్గం అచ్చంపేట మండలం చల్లగరిగిలో పూజలకు పిలుపునిచ్చిన వైఎస్సార్ సీపీ నేత దేవరశెట్టి శ్రీనివాసరావును అచ్చంపేట పోలీసులు నిర్బంధించారు. పోలీసుస్టేషన్‌కు తరలించి దేవాలయంలో పూజల వల్ల శాంతిభద్రతలకు విఘాతం కలిగే ప్రమాదముందని హెచ్చరించారు. సుమారు గంటసేపు స్టేషన్‌లో ఉంచిన పోలీసులు అనంతరం ఇంటికి పంపేశారు.

నరసరావుపేట..



వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు మాజీ శాసనసభ్యులు గోపిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి సూచనలతో శనివారం స్థానిక రెడ్డినగర్ శ్రీ అభయాంజనేయస్వామి ఆలయంలో వైఎస్సార్ సీపీ శ్రేణులు చంద్రబాబు చేసిన ఈ పాపాన్ని ప్రక్షాళన చేయాలని భగవంతుని ప్రార్థించారు. ఈ మేరకు ప్రత్యేక పూజలు చేసి భక్తిశ్రద్ధలతో టెంకాయలు కొట్టారు. ముదిరాజ్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ ఇయం.స్వామి మీడియాతో మాట్లాడుతూ స్వామి వారి లడ్డూ ప్రసాదంపై విమర్శలు రావడం చాలా దురదృష్టకరం అన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీలు, ఎంపీపీలు, సర్పంచులు, ఎంపీటీసీలు, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్, డైరెక్టర్లు, వార్డు ఇన్‌చార్జీలు పాల్గొన్నారు.

వినుకొండ..



తిరుమల పవిత్రతను దెబ్బతీసేవిధంగా అసత్యప్రచారాలు చేయడమేకాకుండా సీనియర్ నాయకుడని చెప్పుకుంటున్న ముఖ్యమంత్రి చంద్రబాబునును ఆ వేంకటేశ్వరస్వామి క్షమించడని మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు శనివారం వైఎస్సార్ సీపీ ట్రేడ్‌యూనియన్ అధ్యక్షులు పి గౌతమ్‌రెడ్డితో కలసి వినుకొండ పట్టణంలోని శ్రీకృష్ణదేవాలయంలో పూజలు చేశారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ బత్తుల వెంకటేశ్వర్లు యాదవ్, ఎంపీపీ జయశ్రీవెంకట్రామిరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ బేతం గాబ్రియేలు, సీనియర్ నాయకులు అమ్మిరెడ్డి అంజిరెడ్డి, సర్పంచ్‌లు కోపెల దేవరాజ్, పరిమి శేషయ్య పాల్గొన్నారు.

చిలకలూరిపేట..

చిలకలూరిపేట మండలంలోని గోవిందపురం గ్రామం లోని షిరిడి సాయిబాబా మందిరంలో వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో శనివారం పూజలు నిర్వహించారు. మండల పార్టీ అధ్యక్షులు గుత్తా యాములయ్య పాల్గొన్నారు. సాయిబాబా మందిరంలో వెంకటేశ్వరస్వామి చిత్రపటం ముందు తిరుపతి లడ్డూ ప్రసాదం ఉంచి పూజలు నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నాయకులు అబ్బూరి సుబ్బారావు, గుత్తా రాగయ్య, మెట్టు శ్రీనివాసరెడ్డి, దేవరపల్లి సూరారెడ్డి, కల్లం చంద్రశేఖర్, కల్లం సుబ్బారెడ్డి పాల్గొన్నారు. యడ్లపాడు మండలం బోయపాలెం కల్యాణ వెంకటేశ్వరస్వామి దేవాలయంలో జరిగిన పూజలలో పార్టీ మండల అధ్యక్షులు గంట శంకర్, లోకం వెంకటలక్ష్మీనారాయణ, వడ్డేపల్లి నరసింహరాజు తదితరులు పాల్గొన్నారు.

సత్తెనపల్లి...



కుల, మతాల మధ్య సీఎం చంద్రబాబు నాయుడు చిచ్చుపెట్టి చోద్యం చూస్తున్నారని, డిక్లరేషన్ పేరుతో, కూటమి కుయుక్తులతో మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి తిరుమలలో శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకోకుండా అడ్డుకున్నారని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి, గుంటూరు మిర్చియార్డ్ మాజీ చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ అన్నారు. సత్తెనపల్లి పట్టణంలోని రైల్వేస్టేషన్ రోడ్డులో ఉన్న అలివేలు మంగా పద్మావతి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో నిర్వహించిన పూజా కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. ఆంజనేయస్వామికి అనంతరం శ్రీవేంకటేశ్వరస్వామికి పూజలు నిర్వ హించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ చిట్టా విజయభాస్కరరెడ్డి మాట్లాడుతూ తిరుమల లడ్డూ విషయంలో కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకొని వెంటనే సీబీఐ విచారణ చేయాలన్నారు. కార్యక్రమంలో చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చల్లంచర్ల సాంబశివరావు, మున్సిపల్ వైస్ చైర్మన్‌లు షేక్ నాగూర్ మీరాన్, రమావత్ కోటేశ్వరావు నాయక్, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పెండెం బాబురావు, పట్టణ పార్టీ అధ్యక్షుడు షేక్ మౌలాలి, మండల పార్టీ అధ్యక్షుడు రాయపాటి పురుషోత్తమరావు తదితరులు పాల్గొన్నారు.

పిడుగురాళ్ల..



ముఖ్యమంత్రి చంద్రబాబుకి దేవుడు మంచి బుద్ధి ప్రసాదించాలని వైఎస్సార్‌సీపీ గురజాల నియోజకవర్గ నాయకులు డాక్టర్ చింతలపూడి అశోక్‌కుమార్ అన్నారు. పిడుగురాళ్ల పట్టణంలోని వేంకటేశ్వరస్వామి దేవాలయంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ చింతా వెంకట రామారావు మాట్లాడారు. మాచవరం మండలం మోర్జంపాడులోని వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. దాచేపల్లి రామాలయంలోపూజలు నిర్వహించారు. పాతపాటేశ్వరి అమ్మవారి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండల కన్వీనర్ గాంధీ, నగర పంచాయతి వైస్ చైర్మన్ షేక్ బడేజానీలు మాట్లాడారు. పోలు వీరారెడ్డి, కొమ్మినేని బుజ్జి, చల్లా కాశీబాబు పాల్గొన్నారు.

పెదకూరపాడు ..



పెదకూరపాడు మండలం 75త్యాళ్లూరులో వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. విఘ్నేశ్వరస్వామి ఆలయంలో, శ్రీ కోదండరామాలయంలో, శ్రీ కాశీ అన్నపూర్ణ విశ్వేశ్వరస్వామి దేవాలయంలో పూజలు నిర్వహించారు. అచ్చంపేటలోని హరిహర క్షేత్రంలోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రసిద్ధ శైవ క్షేత్రమైన అమరావతి అమరేశ్వరునికి శనివారం వైఎస్సార్ సీపీ నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమరేశ్వరునికి రుద్రాభిషేకాలు, బాలచాముండేశ్వరిదేవికి కుంకుమ పూజలు నిర్వహించారు. వైఎస్సార్ సీపీ క్రోసూరు మండల కమిటీ ఆధ్వర్యంలో స్థానిక వెంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

మాచర్ల..



వైఎస్సార్ సీపీ మాచర్ల మండల నాయకులు ఓరుగంటి జయప్రకాష్‌రెడ్డి, పోతురెడ్డి కోటిరెడ్డి ఆధ్వర్యంలో మండలంలోని కొత్తపల్లి గ్రామ దేవాలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఆరికట్ల పున్నారెడ్డి, అప్పిరెడ్డి అంజిరెడ్డి, రవికుమార్, ఎంపీటీసీ తేళ్కూరి శ్రీనివాసరెడ్డి, ఉప సర్పంచ్ దశబంధపు కొండలు, గోగిరెడ్డి హనిమిరెడ్డి, ఓరుగంటి ప్రతాపరెడ్డి, గుండెబోయిన పున్నయ్య, ఓరుగంటి జయభారత్‌రెడ్డి, బాలిరెడ్డి, రమావత్ శ్రీను నాయక్, గోవిందు నాయక్ తదితరులున్నారు.

న్యూస్‌రీల్

ప్రత్యేక పరిష్కార వేదికలో 21 అర్జీలు స్వీకరణ



నరసరావుపేట: స్థానిక కలెక్టరేట్‌లో ఎస్సీ, ఎస్టీల కోసం శనివారం నిర్వహించిన ప్రత్యేక ప్రజాసమస్యల పరిష్కార వేదికలో 21 అర్జీలను జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు స్వీకరించారు. కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన వెనుకబడిన వర్గాలు తమ సమస్యలను తెలియచేశారు. దీనిపై తక్షణమే స్పందించిన కలెక్టర్ సంబంధిత శాఖలకు ఆయా ఫిర్యాదులను అందజేసి సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేశారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతు జిల్లాలో వెనుకబడిన వర్గాలు వారి సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ఈ అవకాశాన్ని ఆయా వర్గాల వారు ఉపయోగించుకోవాలని కోరారు. జిల్లా రెవెన్యూ అధికారి కె.వినాయకం, డీఆర్‌డీఏ పీడీ బాలూనాయక్, అధికారులు పాల్గొన్నారు.

ఉచిత న్యాయ సహాయం కోసం 15100ను వినియోగించుకోండి



నరసరావుపేటటౌన్: ఉచిత న్యాయసేవల కోసం జాతీయ న్యాయసేవాధికార సంస్థ ఉచిత న్యాయ సహాయ అధికారిక నెంబర్ 15100ను వినియోగించుకోవాలని 13వ అదనపు జిల్లా న్యాయమూర్తి ఎస్.సత్యశ్రీ పిలుపునిచ్చారు. శనివారం అదనపు జిల్లా కోర్టు చాంబర్‌లో ఉచిత న్యాయ సహాయంపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడారు. జాతీయ న్యాయసేవాధికార సంస్థ ఆదేశాల మేరకు అధికారిక నెంబర్‌ను అన్ని ప్రాంతాల్లో ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా విస్తత ప్రచారం కల్పిస్తున్నట్లు ఆమె తెలిపారు. రైల్వేస్టేషన్, బస్టాండ్, కోర్టు ఆవరణ, ప్రభుత్వ కార్యాలయాలు, పోస్టాఫీస్, పాఠశాలలు, విద్యాసంస్థలు, బహిరంగ ప్రదేశాల్లో ప్రజల సౌకర్యార్థం బోర్డులను ఏర్పాటు చేయనున్నట్లు ఆమె తెలిపారు. నెంబర్‌ను సద్వినియోగం చేసుకొని ఉచిత సేవలను పొందాలని కోరారు.

భారీ వర్షంతో వాహన చోదకులకు అవస్థలు

తాడికొండ: తాడికొండ మండలం బందారుపల్లి ఆర్‌యూబీలో భారీ వర్షం కారణంగా రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. శనివారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి వరద నీరు ఆర్‌యూబీలోకి చేరి బయటకు కదిలే పరిస్థితి లేకపోవడంతో వాహనచోదకులు ఇబ్బందులు పడ్డారు. సంబంధిత రైల్వే అధికారులు స్పందించి నీటిని వెంటనే తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

నేటి నుంచి పవిత్రోత్సవాలు



పెదకాకాని: స్థానిక శ్రీ భ్రమరాంబ మల్లేశ్వర స్వామి దేవస్థానంలో ఆదివారం నుంచి మూడు రోజులపాటు పవిత్రోత్సవాలు నిర్వహించనున్నట్లు డిప్యూటీ కమిషనర్ జీవీడీఎన్ లీలాకుమార్ తెలిపారు. శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... రాహుకేతు పూజలు సహా అన్ని ఆర్జిత సేవలు రద్దు చేసినట్లు పేర్కొన్నారు. అక్టోబరు 2వ తేదీ అమావాస్యను పురస్కరించుకుని అన్ని పూజా కార్యక్రమాలు యథావిధిగా నిర్వహిస్తామని తెలిపారు. అక్టోబరు 3 నుంచి 12వ తేదీ వరకు శ్రీదేవీ శరన్నవరాత్రోత్సవాలు వైభవంగా నిర్వహిస్తామని వెల్లడించారు. ఈ సందర్భంగా సంబంధిత వాల్‌పోస్టర్‌లు, కరపత్రాలు విడుదల చేశారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు, వేదపండితులు, సిబ్బంది పాల్గొన్నారు.

వచ్చే నెల 3 నుంచి ఏపీ టెట్

గుంటూరు వెస్ట్ : జిల్లాలో వచ్చే నెల 3 నుంచి 21వ తేదీ వరకు ఏపీ టెట్ నిర్వహిస్తామని డీఆర్వో పెద్ది రోజా తెలిపారు. శనివారం స్థానిక కలెక్టరేట్‌లో నిర్వహించిన అధికారుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. ఈ పరీక్షలు జరిగే ప్రాంతంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. అభ్యర్థులకు రవాణా పరంగా ఇబ్బందులు తలెత్తకుండా బస్సులు అందుబాటులో ఉంచాలని పేర్కొన్నారు. విద్యుత్ సరఫరా సక్రమంగా ఉండేలా చూసుకోవాలన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద సెక్షన్ 144 అమలు చేయాలని పేర్కొన్నారు.

పొదుపు సొమ్ము స్వాహా

- ఖాతాదారుల నుంచి రూ.25లక్షలు వసూలు
- ఖాతాల్లో జమ కాని సొమ్ము
- ఆందోళనకు దిగిన ఖాతాదారులు
- విచారణ చేస్తున్న పోస్టల్ శాఖ అధికారులు



కనపర్రు సబ్‌పోస్టాఫీసులో విచారణ జరుపుతున్న పోస్టల్‌శాఖ ఇన్‌స్పెక్టర్లు

నాదెండ్ల: వారంతా కాయకష్టం చేసుకునే పేదలు. భవిష్యత్ అవసరాల కోసం పొదుపు చేసుకుందామని భావించారు. ప్రభుత్వ సంస్థ పోస్టాఫీసులో పొదుపు చేస్తే భద్రత ఉంటుందని నమ్మారు. పోస్టాఫీసులో పొదుపు చేసుకున్నారు. కానీ అధికారులే దొంగలుగా మారి ఆ సొమ్ము స్వాహా చేశారు. సుమారు రూ.25 లక్షలకుపైగా కాజేశారు. బాధితులు పోస్టాఫీసు ముందు ఆందోళనకు దిగారు. చిలకలూరిపేటకు చెందిన పోస్టల్ శాఖ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, సురేష్, సత్తెనపల్లికి చెందిన కోటేశ్వరరావు, వినుకొండకు చెందిన ప్రసాద్ విచారణ చేపట్టారు. నాదెండ్ల మండలం సాతులూరు సబ్ పోస్టాఫీసు పరిధిలో కనపర్రు గ్రామంలో బ్రాంచీ పోస్టాఫీసు నడుస్తోంది. ప్రస్తుతం 500 మందికి పైగా ఖాతాదారులున్నారు. 2022లో బ్రాంచి పోస్ట్ మాస్టర్‌గా పుల్లగూర చందు, అసిస్టెంట్ పోస్ట్‌మాస్టర్‌గా సయ్యద్ సలీంబాషా విధులు నిర్వర్తిస్తున్నారు. ప్రతి నిత్యం గ్రామంలోకి వెళ్లి ఖాతాదారుల వద్ద నుంచి నగదు తీసుకుని వారి వద్ద ఉన్న ఖాతా పుస్తకంలో నమోదు చేసి సంతకం, పోస్టల్ స్టాంపు వేస్తున్నారు. ఆ సొమ్మును తమ జేబుల్లో వేసుకుంటున్నారు. మెచ్యూరిటీ సొమ్ము చెల్లించకుండా తిప్పుతుండటంతో ఖాతాదారులు నిలదీశారు. విషయాన్ని ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయటంతో వీరి బాగోతం బయటపడింది.

సంతకం పెట్టించుకున్నారు..



ప్రతి నెలా రూ.900 ఒక ఖాతా, రూ.100 మరో ఖాతా చొప్పున 60 నెలలపాటూ పూర్తిగా చెల్లించాను. ఈ ఏడాది మార్చిలో నా ఖాతాల గడువు ముగిసింది. ఏప్రిల్ నెలలో రూ.72 వేలు వస్తాయని చెప్పిన పోస్ట్‌మాస్టర్ చందు నా వద్ద పాసు పుస్తకం తీసుకుని సంతకాలు పెట్టించుకున్నాడు. నేటి వరకూ ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు.

-సయ్యద్ మహిమున్నిసా, ఖాతాదారు.

జాషువా పల్నాడు వాసి కావటం అదృష్టం

నరసరావుపేట: గుర్రం జాషువా పల్నాడు జిల్లా వాసి కావడం జిల్లా వాసులకు గర్వకారణమని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు కొనియాడారు. శనివారం కలెక్టర్ కార్యాలయంలో జిల్లా సాంఘిక సంక్షేమశాఖ ఆధ్వర్యంలో గుర్రం జాషువా 129వ జయంతిని ఘనంగా నిర్వహించారు. గుర్రం జాషువా చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ రెండవ ప్రపంచ యుద్ధ కాలంలో జాషువా ప్రచారకుడిగా పనిచేశారని, ఉపాధ్యాయునిగా పనిచేస్తూ కవిత్వం మీద మక్కువతో రచయితగా ఉద్భవించి సమాజంలో చైతన్యవంతమైన రచనలు రచించారన్నారు. ముఖ్యంగా గబ్బిలం కావ్య ఖండంలో దళితుల సమస్యలను ఏకరవు పెట్టారన్నారు. సమాజంలో చైతన్యాన్ని పరిచే విధంగా జాషువా కవితలు ఉన్నాయని, ఆయన జీవితం ఆదర్శప్రాయమని కొనియాడారు. జిల్లా రెవెన్యూ అధికారి కె.వినాయకం మాట్లాడుతూ గుర్రం జాషువా ఔన్నత్యాన్ని విశదీకరించారు. జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి ఓబుల్ నాయుడు మాట్లాడుతూ గుర్రం జాషువా జీవిత వృత్తాంతం తెలియచేశారు. జిల్లా అధికారులు పాల్గొన్నారు.



జాషువా చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు

సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్:నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం శనివారం 588.80 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి కుడికాలువకు 10,350, ఎడమకాలువకు 5,439 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.

జాబ్‌మేళాలో 47 మందికి ఉద్యోగాలు




క్రోసూరు: క్రోసూరులోని పాలిటెక్నిక్ కళాశాలలో ఏపీఎస్ఎస్‌డీ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన జాబ్‌మేళాకు 183 మంది హాజరుకాగా 47 మంది ఉద్యోగాలు పొందినట్లు జిల్లా నైపుణ్యాధికారి తమ్మాజిరావు తెలిపారు. జాబ్‌మేళాకు ముఖ్యఅతిథిగా కాలేజి ఇన్‌చార్జి ప్రిన్స్‌పాల్ డాక్టర్ డేవిడ్‌రాజు, ఎలక్ట్రానిక్ విభాగ అధిపతి రామన్న పాల్గొన్నారు. డేవిడ్‌రాజు మాట్లాడుతూ ఏపీఎస్ఎస్‌డీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ నేతృత్వంలో క్రోసూరు పాలిటెక్నిక్ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహించటం సంతోషించదగిన విషయమని అన్నారు. నియామక పత్రాలు అందుకున్న యువతను అభినందించారు. ఉద్యోగాలు పొందిన యువత నైపుణ్యాలు మరింత మెరుగుపరుచుకుని మరిన్ని ఉన్నత శిఖరాలు అందుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సత్తెనపల్లి కోఆర్డినేటర్ ఈ.రామకృష్ణారెడ్డి, క్రోసూరు కోఆర్డినేటర్ బి.అంజిరెడ్డి, యంగ్ ప్రొఫెషనల్ శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.



గుండె చప్పుడు విందాం

- లయతప్పుతున్న గుండె
- యుక్త వయసులోనే గుండెపోటు
- ఆరోగ్య నియమాలు పాటించకపోవడమే కారణం
- గుండె చప్పుడు తెలుసుకోవాలంటున్న వైద్యులు
- నేడు ప్రపంచ హృదయ దినోత్సవం



సాక్షి, నరసరావుపేట: ఆనందాలతో పులకించాల్సిన హృదయం.. నేడు ఆందోళనతో ఉక్కిరిబిక్కిరవుతోంది. బాధల ముళ్లు గుచ్చుకున్నప్పుడు కన్నీరై ద్రవించే హృదయం.. నేడు ప్రతి క్షణం కంగారు పడుతోంది. ఆకాశాన్ని అందుకునేంత ఆత్మవిశ్వాసంతో గుండె నిబ్బరంతో లబ్‌డబ్ అంటూ కొట్టుకోవాల్సిన యువత హార్ట్ బీట్.. అర్ధాంతరంగా ఆగిపోతోంది. ఆరోగ్యాన్ని వదిలి కాలంతో పరుగులు పెడుతున్న యువత.. లయ తప్పిన గుండెచప్పుడు వినడంలో వెనకబడి ప్రాణాలకు ముప్పు తెచ్చుకుంటోంది. నేడు ప్రపంచ హృదయ దినోత్సవం సందర్భంగా గుండె పనితీరును ఎప్పటికప్పుడు తెలుసుకోవాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ పిలుపునిస్తోంది. అందుకే ఒక్కసారి మన హృదయ స్పందనను మనసారా విందాం. దాని ఆవేదనను అర్థం చేసుకొని అవసరమైన స్వాంతనను కలిగిద్దాం.

అధిక మరణాలు గుండె సంబంధిత వ్యాధితోనే...

ప్రస్తుతం ప్రపంచంలో అత్యధిక మరణాలు హృదయ సంబంధిత వ్యాధులతోనే సంభవిస్తున్నాయన్నది వాస్తవం. ఏటా సుమారు 1.7 కోట్ల మంది ప్రపంచవ్యాప్తంగా ఈ కారణంతోనే మరణిస్తున్నారని అధ్యయనాలు చెబుతున్నాయి. గతంలో వయసు పెరిగిన తరువాత మాత్రమే వచ్చే ఈ పెనుముప్పు ప్రస్తుతం యువతలోనూ దాపరిస్తోంది. మారిన జీవన శైలి. ఏమాత్రం శారీరక శ్రమ లేకపోవడం, తీవ్ర మానసిక ఒత్తిడి, జంక్ ఫుడ్స్ కారణమని వైద్యులు చెబుతున్నారు. మద్యపానం, ధూమపానం, పొగాకు ఉత్పత్తులు నమలటం వంటి చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని హెచ్చరిస్తున్నారు.

అవగాహన లేకపోవడంతో...



ప్రస్తుతం ప్రపంచంలో ఎక్కువ మరణాలు గుండె సంబంధిత వ్యాధితోనే సంభవిస్తున్నాయి. గతంలో పెద్ద వయస్కులకు గుండె సంబంధిత వ్యాధుల బారినపడేవారు. ఈ మధ్యకాలంలో 40 ఏళ్లలోపు వారు వీటితో మరణిస్తున్నారు. దీనికి ప్రధాన కారణం అవగాహన లేకపోవడం. తరచూ షుగర్, బీపీ, రక్తంలో చెడు కొవ్వుస్థాయిలు చెక్ చేసుకోవడం మంచిది. 20 ఏళ్ల నుంచే రెండేళ్లకు ఒకసారి, 40 ఏళ్ల తరువాత ఏడాదికొకసారి ఈసీజీ, షుగర్, బీపీ వంటి పరీక్షలు తప్పనిసరిగా చేయించుకుంటే ఈ ప్రమాదం బారినపడకుండా ఉండవచ్చు.

–డాక్టర్ కారసాని శ్రీనివాసరెడ్డి, గుండె వైద్యులు, మహాత్మాగాంధీ సూపర్ స్పెషాలిటీ హాస్పటల్, నరసరావుపేట.

జీవన సరళిలో మార్పుల వల్లే...



యువత జీవన సరళిలో వస్తున్న మార్పుల వల్ల వారి ఆరోగ్యంపై ప్రభావం చూపుతోంది. ముఖ్యంగా హృదయ సంబంధిత వ్యాధుల బారినపడుతున్నారు. వారిలో పెరుగుతున్న పని ఒత్తిడి, మానసిక అలజడి, జంక్‌ఫుడ్ తినడం, తగిన వ్యాయామం చేయకపోవడంతో ఈ ఇబ్బంది ఎదురవుతోంది. ప్రతి ఒక్కరూ వారంలో కనీసం 5 రోజులపాటు వ్యాయామం చేయడం, 7–8 గంటలపాటు నిద్రపోవడం, సమతుల ఆహారం తీసుకోవడ, తరచూ ఆరోగ్య పరీక్షలు చేయిచడం ఉత్తమం. వరల్డ్ హార్ట్ డే వంటి ప్రత్యేక రోజుల వల్ల ఆరోగ్యంపై ప్రజలకు అవగాహన కలిగే అవకాశం ఉంటుంది.

– డాక్టర్ గార్లపాటి కృష్ణకాంత్, గుండె వైద్యులు, శ్రీదత్త సూపర్ స్పెషాలిటీ హాస్పటల్, నరసరావుపేట.

మంచి అలవాట్లతో కట్టడి...



మంచి జీవన, ఆహారపు అలవాట్లతో గుండె సంబంధిత రోగాలను దాదాపుగా కట్టడి చేయవచ్చు. క్రమం తప్పకుండా వ్యాయామం, కొవ్వు తక్కువగా ఉండే పదార్థాలు తీసుకోవడం, కూరగాయలు, పండ్లు అధికంగా తీసుకోవడం వల్ల ఆరోగ్యంగా ఉండవచ్చు. షుగర్, బీపీల వల్లే ఎక్కువగా గుండె సంబంధిత వ్యాధులు రావడానికి కారణం. తరచూ వాటి స్థాయిలను తెలుసుకొని పరీక్షలు చేయించుకోవడం ఉత్తమం. మానసిక ఒత్తిడిని తగ్గించుకోవడం, శారీరక శ్రమను పెంచడం వల్ల ఆరోగ్యంగా ఉండే ఆస్కారముంది.

– డాక్టర్ కోట శబరి గిరీష్, గుండె వైద్యులు, డాక్టర్ అంజిరెడ్డి సూపర్ స్పెషాలిటీ హాస్పటల్, నరసరావుపేట.

గ్రామ రెవెన్యూ సహాయకుల జిల్లా కార్యవర్గం ఎన్నిక

అధ్యక్ష, కార్యదర్శులుగా జాన్‌సైదా, నరసింహారావు



నరసరావుపేట: పల్నాడు జిల్లా గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘ నూతన కార్యవర్గ అధ్యక్ష, కార్యదర్శులుగా జి.జాన్‌సైదా, ఉప్పల నరసింహారావు ఎన్నికయ్యారు. శనివారం ఆర్డీవో కార్యాలయ ప్రాంగణంలోని సర్వే భవనంలో నిర్వహించిన సమావేశంలో రాష్ట్ర అధ్యక్షులు జి.బ్రహ్మయ్య, కోశాధికారి సీహెచ్.సత్యనారాయణ, జిల్లా అధ్యక్షుడు నాగమల్లేశ్వరరావు అధ్యక్షతన నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా సహాయ అధ్యక్షులుగా ఎం.ఏసు, కోశాధికారి యు.మోషే, సంయుక్త కార్యదర్శి డి.నాగేశ్వరరావు మరో నలుగురిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. అనంతరం గ్రామ సహాయకులు ఎదుర్కొంటున్న సమస్యలు తీర్చాలని కోరుతూ ఆర్డీవో పి.సరోజినీకి వినతిపత్రం అందజేశారు.

రేపు షూటింగ్ బాల్ బాల, బాలికల జిల్లా జట్ల ఎంపికలు

సత్తెనపల్లి: జిల్లా షూటింగ్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జూనియర్ బాల,బాలికల జిల్లా జట్ల ఎంపికలు సత్తెనపల్లి మండలం గుడిపూడి జెడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం జరుగుతాయని పల్నాడు జిల్లా షూటింగ్ బాల్ అసోసియేషన్ కార్యదర్శి కోనంకి కిరణ్‌కుమార్ శనివారం తెలిపారు. 2005 ఏప్రిల్ ఒకటి తర్వాత జన్మించిన వారు అర్హులు అన్నారు.

నాలుగు కిలోల గంజాయి, స్కూటీ స్వాధీనం

- నిందితుడి అరెస్ట్
- కేసు వివరాలు వెల్లడించిన డీఎస్పీ



నిందితుడి వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ నాగేశ్వరరావు, పక్కన సీఐ హైమారావు, ఎస్‌ఐ అశోక్

నరసరావుపేటటౌన్: అక్రమంగా గంజాయి కలిగిన కేసులో నిందితుడిని అరెస్ట్ చేసి అతని వద్ద నుంచి నాలుగు కిలోల గంజాయి, అక్రమ రవాణాకు వినియోగించిన స్కూటీ వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ కె.నాగేశ్వరరావు తెలిపారు. శనివారం టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేసు వివరాలను ఆయన వెల్లడించారు. చంద్రబాబునాయుడు కాలనీకి చెందిన ఉప్పుతోళ్ల తిరుపతిరావు తన ఇంట్లో అక్రమంగా గంజాయి కలిగి ఉన్నాడన్నా సమాచారం మేరకు శుక్రవారం రాత్రి తనిఖీలు నిర్వహించామన్నారు. అక్కడ సుమారు నాలుగు కిలోల గంజాయిను స్వాధీనం చేసుకున్నామన్నారు. తిరుపతిరావు మినీ ట్రాన్స్‌పోర్టు వాహనానికి డ్రైవర్‌గా పనిచేస్తున్న సమయంలో తరచూ విశాఖపట్టణం వెళ్లి వస్తుండేవాడన్నారు. అక్కడ గంజాయి విక్రయించే ముఠాతో సంబంధాలు పెట్టుకొని గంజాయి కొనుగోలు చేసి పట్టణంలో యువతకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నట్లు విచారణలో తేలిందన్నారు. నిందితుడికి ఇద్దరు భార్యలు ఉండటంతో కుటుంబ పోషణ కష్టంగా మారినందున సులభంగా ఎక్కువ డబ్బులు సంపాదించవచ్చన్న ఆశతో ఈ మార్గాన్ని ఎంచుకున్నాడన్నారు. నిందితుడిపై గతంలో నరసరావుపేట వన్‌టౌన్, టూటౌన్‌లతో పాటు నల్లపాడు పోలీస్‌స్టేషన్‌లలో కేసులు నమోదై ఉన్నాయన్నారు. సమావేశంలో సీఐ హైమారావు, ఎస్‌ఐ అశోక్, ఏఎస్‌ఐ సుబ్బారావు, సిబ్బంది పాల్గొన్నారు.

వ్యాపారుల నుంచి 3.5 కిలోల బంగారం చోరీ

బొమ్మలసత్రం: సత్తెనపల్లికి చెందిన ఇద్దరు బంగారు వ్యాపారుల నుంచి 3.5 కేజీల బంగారం గుర్తుతెలియని దొంగలు అపహరించారు. బాధితులు తెలిపిన వివరాల మేరకు.. సత్తెనపల్లిలో బంగారు వ్యాపారం చేసే రంగారావు, సతీష్‌కుమార్ 3.5 కేజీల బంగారాన్ని విక్రయించేందుకు బళ్లారికి శుక్రవారం వెళ్లారు. అక్కడ సరైన ధర లభించకపోవడంతో అదే రోజు రాత్రి ఇద్దరూ బంగారు ఆభరణాలతో హుబ్లీ–విజయవాడ రైలులో తిరుగు ప్రయాణమయ్యారు. అయితే.. తెల్లవారుజామున 4 గంటలకు దొనకొండ వద్ద బంగారం ఉండే బ్యాగ్ కనిపించకపోవటంతో కంగారు పడ్డారు. వెంటనే నంద్యాల, నరసరావుపేట పోలీసులకు సమాచారమిచ్చారు. ఈ విషయంపై నంద్యాల రైల్వే ఎస్‌ఐ జలీల్‌ను వివరణ కోరగా.. దొనకొండ వద్ద బ్యాగు కనిపించకుండా పోయినందున అది నరసారావుపేట పోలీసుస్టేషన్ పరిధిలోకి వస్తుందని చెప్పారు.

జిల్లాను నంబర్ వన్‌గా నిలపాలి

- జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు
- పింఛన్ల పంపిణీపై సమీక్ష



మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు

నరసరావుపేట: వచ్చేనెల ఒకటో తేదీన జిల్లాలో పింఛన్ల పంపిణీ పకడ్బందీగా చేపట్టి త్వరగా పూర్తిచేసి జిల్లాను రాష్ట్రంలో నంబర్ వన్ స్థానంలో నిలపాలని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టర్ కార్యాలయం నుంచి ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీపై డీఆర్‌డీఏ పీడీ, డీపీవో, మండల ప్రత్యేక అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఉదయం ఐదు గంటల నుంచే పంపిణీ మొదలుపెట్టాలన్నారు. సంబంధిత అధికారులు ముందుగానే బ్యాంకుల్లో నగదును తీసుకొని అందుబాటులో పెట్టుకని పంపిణీ చేపట్టేందుకు సంసిద్ధంగా ఉండాలన్నారు. ప్రత్యేక దృష్టితో సకాలంలో పంపిణీ చేయాలన్నారు. గ్రామ, మండల స్థాయిలో అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసుకోవాలన్నారు. మండల ప్రత్యేక అధికారులు 30వ తేదీ రాత్రి మండలంలో బసచేసి క్షేత్రస్థాయి సిబ్బందితో సమన్వయం చేసుకొని పంపిణీలో జాప్యం లేకుండా చేయాలని ఆదేశించారు. డీఆర్వో కె.వినాయకం, డీఆర్‌డీఏ పీడీ బాలూనాయక్ పాల్గొన్నారు.

ఐఎంఏ అధ్యక్షుడిగా డాక్టర్ యార్లగడ్డ సుబ్బారాయుడు



నూతనంగా ఎన్నికైన ఐఎంఏ నేతలు

గుంటూరు మెడికల్: ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) గుంటూరు శాఖ అధ్యక్షుడిగా గుంటూరుకు చెందిన కాక్లియర్ ఇంప్లాంట్ సర్జన్ డాక్టర్ యార్లగడ్డ సుబ్బారాయుడు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గుంటూరులోని ఐఎంఏ హాలులో సంఘ వార్షిక సర్వ సభ్య సమావేశం జరిగింది. గత ఏడాది జరిగిన నిరంతర విద్యా సంభందిత విషయాలు, క్రియాశీలక కార్యక్రమాలపై చర్చించారు. వరదల సమయంలో సాయం అందించినందుకు రాష్ట్ర ప్రభుత్వం, అగ్నిమాపక శాఖల నుంచి ప్రశంసాపత్రాలు అందుకున్నట్లు సంఘం ప్రధాన కార్యదర్శి బూసిరెడ్డి నరేంద్ర తెలిపారు. అనంతరం ఎన్నికలలో అధ్యక్షుడిగా యార్లగడ్డ సుబ్బారాయుడు, ఉపాధ్యక్షుడిగా డాక్టర్ అమరలింగేశ్వరరావు, కార్యదర్శిగా డాక్టర్ సాయి కృష్ణ, సహాయ కార్యదర్శిగా డాక్టర్ చంద్ర రాధికారాణి , 25 సభ్యులతో కూడిన ఇతర కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి డాక్టర్ విశ్వేశ్వరరావు ప్రకటించారు. నూతన కార్యవర్గానికి సభ్యులందరూ శుభాకాంక్షలు తెలిపారు. డాక్టర్ సుబ్బారాయుడు మాట్లాడుతూ.. రాబోయే కాలంలో మరిన్ని సమాజానికి ఉపయోగపడే సేవా కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. తమపై విశ్వాసం ఉంచి ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు సభ్యులందరికీ ధన్యవాదాలు తెలిపారు.

పరిహారం నమోదులో వివక్ష



కొల్లూరు రెవెన్యూ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న గాజుల్లంక వాసులు

- గాజుల్లంక గ్రామస్తులు నిరసన
- టీడీపీ నేతలు చెప్పిన వారి పేర్లు మాత్రమే నమోదు
- విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని డిమాండ్

కొల్లూరు: కృష్ణా నదీ వరదల వల్ల సంభవించిన నష్టం నమోదులో అర్హులకు చోటుదక్కకపోవడంపై నిరసన గళం విప్పారు. మండలంలోని గాజుల్లంక గ్రామస్తులు శనివారం కొల్లూరు రెవెన్యూ వద్ద నిరసన తెలిపారు. తొలుత గాజుల్లంక సచివాలయం వద్ద అధికారుల్ని నిలదీశారు. తూతూమంత్రంగా నమోదు ప్రక్రియ ముగించారని మండిపడ్డారు. టీడీపీకి చెందిన నాయకులు చెప్పిన వారికే పరిహారం నమోదులో స్థానం కల్పించారని ఆవేదన వ్యక్తం చేశారు. సచివాలయ సిబ్బంది నుంచి సరైన సమాధానం రాకపోవడంతో మూకుమ్మడిగా కొల్లూరు రెవెన్యూ కార్యాలయానికి వెళ్లారు. గ్రామస్తుల నుంచి తహసీల్దార్ బి. వెంకటేశ్వర్లు వివరాలు తెలుసుకున్నారు. వీఆర్వో, సచివాలయ కార్యదర్శులను పిలిపించి నష్ట నమోదులో జరిగిన పొరపాట్లపై ప్రశ్నించారు. అనంతరం గ్రామస్తుల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి రెండో జాబితా సిద్ధం చేయిస్తానని హామీ ఇచ్చారు.

అసైన్డ్ భూమి పేరుతో పరిహారం బొక్కేశారు

పంట పొలాల పరిహారంపై సర్వే బృందాలు పరిశీలించకుండానే నమోదు చేపట్టడంపై రైతులు తహసీల్దార్ వద్ద ఆందోళన వ్యక్తం చేశారు. జమీందారి, అసైన్డ్ భూముల పేరుతో పంట నష్ట నమోదు బృందాలు పరిహార జాబితాలో చోటు కల్పించలేదని వాపోయారు. టీడీపీ నాయకులు మాత్రం నమోదు చేయించుకొని పరిహారాన్ని దిగమింగారని ఆరోపించారు. విచారణ చేయించి తమకు పరిహారం అందించాలని డిమాండ్‌చేశారు. విచారణ చేపట్టిస్తామని తహసీల్దార్ హామీ ఇచ్చారు.

నేడు యూటీఎఫ్ ఆధ్వర్యంలో క్రీడా పోటీలు

నరసరావుపేటఈస్ట్: ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) స్వర్ణోత్సవ వేడుకల్లో భాగంగా ఉపాధ్యాయులకు జిల్లా స్థాయి క్రీడా పోటీలను ఆదివారం డీఎస్ఏ స్టేడియంలో నిర్వహిస్తున్నట్లు ఫెడరేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు పి.ప్రేమ్‌కుమార్, జి.విజయసారథి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. క్రికెట్, వాలీబాల్, బ్యాడ్మింటన్, క్యారమ్స్, చెస్, అథ్లెటిక్ తదితర విభాగాలలో పోటీలు నిర్వహిస్తామన్నారు. ఉపాధ్యాయులు అధికసంఖ్యలో పాల్గొని క్రీడా పోటీలను విజయవంతం చేయాలని కోరారు.

రేపు అండర్-19 జిల్లా స్థాయి ఎంపికలు

సత్తెనపల్లి: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి గుంటూరు జిల్లా అండర్–19 బాల్ బ్యాడ్మింటన్ రైఫిల్ షూటింగ్ జిల్లా జట్ల ఎంపికలు సత్తెనపల్లి మండలం గుడిపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం జరుగుతాయని అండర్–19 స్కూల్ గేమ్స్ ఉమ్మడి గుంటూరు జిల్లా కార్యదర్శి జి.నరసింహారావు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. క్రీడా ఎంపికలకు హాజరయ్యే క్రీడాకారులు 2006 జనవరి 01 తర్వాత జన్మించి ఉండాలని, ఆధార్ కార్డు, ప్రిన్సిపల్ ధ్రువీకరణతో 10వ తరగతి మార్కుల జాబితాతో హాజరు కావాలని కోరారు.